ప్రజాశక్తి

సోమవారం 25 నవంబర్ 2024 | 5 | విజయనగరం



ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

కబడ్డీ జిల్లా జట్లు ఎంపిక

విజయనగరం టౌన్ : స్థానిక రాజీవ్ స్టేడియంలో సీనియర్ స్త్రీ, పురుష కబడ్డీ జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. 16 మంది చొప్పున ఎంపిక చేసి, శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 5 నుండి 8 వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవిపి రాజు, కార్యదర్శి ప్రభావతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్ష్మణరావు, ట్రెజరర్ శివకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగంతోనే
పేదలకు మెరుగైన విద్య

మహాసభలో మాట్లాడుతున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల జెఎసి రాష్ట్ర చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు

ర్యాలీ చేపడుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

- హక్కుల కోసం నిలబడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి
- కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల జెఎసి రాష్ట్ర చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు
- ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ
- నగరంలో ఉపాధ్యాయుల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రభుత్వ విద్యా రంగంతోనే పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల జెఎసి రాష్ట్ర చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు స్పష్టంచేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా రంగ ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా రంగాన్ని రక్షించుకోవడం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని, అందుకు యుటిఎఫ్ అగ్రభాగంలో నిలవాలని పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని శేషగిరి విజ్ఞాన భవనంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ వద్దనున్న జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి కెఎల్‌పురంలోని శేషగిరి విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె) వరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌వికె వద్ద ఎస్‌టిఎఫ్‌ఐ జెండాను సీనియర్ నాయకులు సత్యశ్రీనివాస్, యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు డి.రాము ఆవిష్కరించారు. ఇటీవల కాలంలో మరణించిన యుటిఎఫ్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన మహాసభలో నాగేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపైనే కాకుండా సామాజిక స్పృహతో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు సమస్యలపై అండగా ఉన్న ఏకైక సంఘం యుటిఎఫ్ అన్నారు. ఏ లక్ష్యంతో యుటిఎఫ్ 50 ఏళ్ల క్రితం ఏర్పడిందో, అదే లక్ష్య సాధనకు పునరంకితం కావడం శుభపరిణామమన్నారు.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ విధానాలే అమలు చేస్తూ ఉద్యోగులపై భారాలు మోపుతోందన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డిఎలు, ఎరియర్స్ లేవని చెప్పారు. విద్యా రంగాన్ని బలోపేతం చేసే చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యా రంగాన్ని ప్రయివేటు పరం చేయడమే పనిగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. మోడల్ స్కూళ్లు, కెజిబివిలు, యూనివర్సిటీలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులను నియమిస్తున్నారంటే విద్యా రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత గుర్తించాలన్నారు. ప్రభుత్వ రంగాలను కాపాడుకోవాలంటే పోరాటాలతోపాటు చట్టసభల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు, ప్రజల గొంతు వినిపించే వారుండాలన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పిలుపునిచ్చారు.

అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ కరోనా సమయంలోనూ ప్రజలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సదస్సులు పెట్టి తన ప్రాణాలు కోల్పోయిన సరే అభ్యుదయ వాదాన్ని కడవరకు కొనసాగించిన కె.శేషగిరి అందరికీ స్ఫూర్తి అన్నారు. ప్రభుత్వం సృష్టించే సమస్యలను ఐక్యంగా పోరాడి పరిష్కరించుకోవాలన్నారు.

అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. సభలో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కార్యదర్శి బి.కాంతారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ బి.హరీష్, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షులు పార్వతి, కోశాధికారి చింతా భాస్కరరావు, కె శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసరావు, ఈశ్వరరావు

ఈశ్వరరావు, శ్రీనివాసరావు

మహాసభలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వర రావు, గౌరవ అధ్యక్షులుగా మీసాల అప్పలనాయుడు ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారిగా సిహెచ్ భాస్కరరావు, కార్యవర్గ సభ్యులుగా కె.ప్రసాదరావు, పి.వాసు, పి.త్రినాథరావు, ఎం.కేశవ, ఆర్‌ఎవి సూర్యారావు, పి.వాసుదేవరావు, జి.వి.రమణ, జి.రాజారావు, సిహెచ్ తిరుపతినాయుడు, కె.శ్రీదేవి, వి.రాధా భవాని, ఎన్.సత్యనారాయణ, ఎం.రఘునాథరాజు, అల్లు శంకరరావు ఎన్నికయ్యారు.

చి'వరి'లో నిరాశ

నేలరాలిన ధాన్యం

- 1121 రకంలో ఉధృతంగా కత్తెర పురుగు
- పంట చేతికొచ్చే సమయంలో నేలరాలుతున్న ధాన్యం

ప్రజాశక్తి - గుర్ల

వరి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. పంటపై కత్తెర పురుగు ప్రభావం ఎక్కువగా ఉండడంతో పండిన వరి పంట సగానికి పైగా నేలపాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందే సమయంలో కత్తెర పురుగు పంటను పాడు చెయ్యడం వల్ల దిగుబడి తగ్గి పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో గరికివలస, పల్లిగండ్రేడు, పాలవలస తదితర గ్రామాలలో ఈ తెగుళ్ల ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ సంవత్సరం ఇప్పటివరకు కొంత మేర వాతావరణం రైతుకు సహకరించినా కత్తెర పురుగు మాత్రం రైతుల దిగుబడికి కత్తెర వేసింది. పంట కోసిన తరువాత పంటపొలంలో ధాన్యం ఎక్కువగా రాలడంతో రైతులు చాలా నిరాశకు గురవుతున్నారు. రైతులకు పండించిన పంటకు ఏదో ఒక రూపంలో నష్టం మాత్రం జరుగుతూనే ఉంది. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పుడు రైతు శ్రేయస్సు కోసం పనిచేస్తున్నామని ఉపన్యాసాలు ఇస్తున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ పురుగు గురించి ముందస్తుగా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించి ఉంటే ఇప్పుడు ఈ నష్టం జరిగేది కాదని పంట కోసిన వెంటనే మొత్తం సగానికి పైగా వరి పొలంలోనే రాలిపోతుందని ఇక తిండి గింజలు కూడా ఇంటికి రావడం చాలా కష్టమని రైతులు వాపోతున్నారు. కత్తెర పురుగు చేరి వరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎన్నడూ లేదు

విత్తనం వేసిన నాటి నుంచి పంటదశకు వచ్చేవరకు ఎకరాకు 25 నుంచి 30 వేల రూపాయలు పెట్టుబడులు పెట్టామని రైతులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులు వల్ల ఇంజన్‌లతో నీరు తోడి పంటను పండించినప్పటికీ కోతదశకు వచ్చేసరికి కత్తెర పురుగు వరి కంకులు రెళ్లను కత్తిరించడం తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని అంటున్నారు. ఈ పురుగు ప్రభావం ఎక్కువగా 1121 వరి రకానికి సోకిందని రైతులు చెబుతున్నారు. కోతదశలో పంటపై ఈ రకమైన తెగుళ్ల రావడం గడిచిన దశాబ్ద కాలం నుంచి ఎప్పుడూ లేదని కొంతమంది రైతులు చెబుతున్నారు.

ముమ్మరంగా పూడిక తీతలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత కొన్నాళ్లుగా పూడికతో మూసుకుపోయి, నిరుపయోగంగా ఉన్న కాలువలను కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో సిబ్బంది పరిశుభ్ర పరుస్తున్నారు. ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేపడుతున్నారు. మూసుకుపోయిన కాలువలను జెసిబిల సహాయంతో ప్రక్షాళన చేసి, మురుగునీటి ప్రవాహానికి అడ్డులేకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముంజేరులో పల్లె పండుగ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి, కర్రోతు బంగార్రాజు(ఫైల్)

నెల్లిమర్ల నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య విభేదాలతో నేటికీ పల్లెపండగ పనులు ముందుకు సాగడం లేదు. జనసేన, టిడిపి, బిజెపి పార్టీలు పర్సంటేజీలు వారిగా పనులు కేయించుకోవాలని రాష్ట్ర కూటమి నాయకులు తేల్చి చెప్పారు. కాని ఎమ్మెల్యే లోకం మాధవి అసెంబ్లీ సమావేశాల్లో ఉండడంతో కేటాయింపులు చేసుకోలేదు. దీంతో నేటికి ఈ పనులకు సంబంధించిన పంచాయితీ తేలలేదు. ఫలితంగా ప్రస్తుతం నియోజకవర్గంలో ఈ పనులు ప్రారంభం కాలేదు. మరోపక్క జిల్లా కలెక్టరు వచ్చే నెల 15వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కొన్ని మండలాల్లో పనులు ప్రారంభించనప్పటికీ కలెక్టర్ ఒత్తిడితో పనులు జరుగుతున్నట్లు లెక్కలు చూపిస్తున్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు పూర్తి కావడంతో పనులకు సంబంధించిన పంచాయితీపై ఉత్కంఠ నెలకొంది.

'పల్లె పండగ'కు
పంచాయితీ గ్రహణం

- తేలని కూటమి 'లెక్కలు'
- ముందుకు సాగని పనులు
- వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తికావాలంటున్న కలెక్టర్
- 265 పనులకు 25 ప్రారంభం

ప్రజాశక్తి - భోగాపురం

నెల్లిమర్ల నియోజకవర్గంలో ఉపాధిహామీకి సంబంధించిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.23.90కోట్లతో 265 పనులు మంజూరయ్యాయి. ఇందులో భోగాపురం మండలంలో 36పనులకు రూ.5.17కోట్లు, డెంకాడ మండలంలో 66 పనులకు రూ.5.90 కోట్లు, పూసపాటిరేగలో 85 పనులకు రూ.6.61 కోట్లు, నెల్లిమర్లలో 78 పనులకు రూ.6.21కోట్లు నిధులు మంజూరయ్యాయి. కూటమిలో విభేదాలు లేకపోతే ఇప్పటికే ఈ పనులు ప్రారంభించాల్సి ఉండాలి. కాని ఇందులో పదిశాతం పనులు కూడా ప్రారంభం కాలేదు. ఇప్పటి వరకూ నియోజక వర్గంలో కేవలం 23 పనులు మాత్రమే ప్రారంభమయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చును.

పంచాయితీపై నెలకొన్న ఆసక్తి

పల్లె పండుగ పనులపై కూటమి నేతల పంచాయితీ నియోజకవర్గంలో ఉత్కంఠ రేపుతోంది. అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో ఎమ్మెల్యే ఇటీవలి అందుబాటులో లేరు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంతో ముగిసాయి. ఆమె వచ్చిన తరువాత వీరిద్దరే నేరుగా కూర్చోని పనులు కేటాయింపులు చేసుకుంటారా లేదా ఇంఛార్జి మంత్రి అనిత సమక్షంలో కూర్చొంటారనే దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే అధిష్టానం ఎన్నికల అనంతరం పార్టీలో చేరిన వైసిపి నాయకులకు పనులు కేటాయించవద్దని స్పష్టం చేసినట్లు సమాచారం. కనుక కూటమి నేతలు ఏ విధంగా ఈ పంచాయితీ తేలుస్తారనే దానిపై పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పనులు ప్రారంభించాలంటు ఇటీవలి అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టరు తేల్చి చెబుతున్నారు. అంతేకాక ఈ పనులు వచ్చేనెల 15వ తేదీలో పూర్తి చేయాలని అంటున్నారు. కాని కూటమి నేతల పంచాయితీ పూర్తయితే కాని పనులు ప్రారంభమయ్యే పరిస్థితి నియోజకవర్గంలో లేదు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు.

కూటమి నేతల్లో విభేదాలతోనే పనులకు ఆటంకం

కూటమి నేతల్లో విభేదాలే ఈ పనులు ముందుకు సాగడం లేదని పలువురు అంటున్నారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఎమ్మెల్యే లోకం మాధవి, టిడిపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మధ్య నెల్లిమర్ల కౌన్సిల్ సమావేశంలో జరిగిన సంఘటనతో ఒక్కసారిగా విభేదాలు రచ్చకెక్కాయి. ఈ నేపథ్యంలో ఇటీవలి రాష్ట్ర అధిస్టానం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఇరువుని పిలిపించి పంచాయితీ కూడా చేశారు. పనుల విషయంలోనూ జనసేన, టిడిపి, బిజెపి నాయకులకు పర్సంటేజీలు వారీగా పనులు కేటాయించుకోవాలని అసెంబ్లీ సమావేశాలకు ముందు రాష్ట్ర నాయకత్వం ఇరువురిని కూర్చోపెట్టి తెలిపింది. కానీ అప్పటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో ఎమ్మెల్యే నియోజకవర్గంలో అందుబాటులో లేరు. దీంతో పర్సంటేజీలపై లెక్క తేలకపోవడంతో పనులు ముందుకు కదల్లేదు.

డయేరియా అదుపులో ఉంది

- అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం
- జిల్లాలో 2300 మంది క్షయ రోగులు
- 'ప్రజాశక్తి'తో డిఎంహెచ్ఒ కె.రాణి ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా వ్యాప్తంగా డయేరియా అదుపులో ఉందని ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ కె.రాణి తెలిపారు. ప్రస్తుతం గుర్ల మండలంలో ఎక్కడా డయేరియా కేసులు లేవని చెప్పారు. ప్రస్తుతం నీరు సరఫరా చేస్తున్న పంప్‌హౌస్, వాటర్ ట్యాంకుల వద్ద ప్రతిరోజూ క్లోరినేషన్ చేస్తున్నట్లు తెలిపారు. డిపిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, జెడ్‌పి సిఇఒ, ఎంపిడిఒలు, గ్రామ స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



ప్రస్తుతం గుర్ల మండలంలో డయేరియా పరిస్థితి ఎలా ఉంది.?

ప్రస్తుతం గుర్ల మండలంలో డయేరియా సాధారణ పరిస్థితిలో ఉంది. గతం మాదిరిగా ప్రజలు ఎవరూ ఇబ్బంది పడే పరిస్థితి లేదు. అంతా అదుపులోకి వచ్చింది. ప్రస్తుతం ప్రతిరోజూ ట్యాంకులు క్లోరినేషన్ చేస్తూ, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేస్తూ నీరు సరఫరా చేస్తున్నారు.

డయేరియా ప్రబలకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

జిల్లా, మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షణ చేపడుతున్నాం. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటనల ద్వారా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులతోపాటు వైద్యులను అప్రమత్తం చేస్తున్నాం. ప్రతి వారం జూమ్ ద్వారా సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు సమాచారాలు అందిస్తూ ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటున్నాం.

జిల్లాలో ఎంతమంది క్షయరోగులు ఉన్నారు.?

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది గుర్తించినవి 2300 కేసులు ఉన్నాయి. వీరికి ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు మందులు అందిస్తూ, పర్యవేక్షణ చేస్తున్నారు.

క్షయ లక్షణాలను గుర్తించడం ఎలా.?

దగ్గు నిరంతరంగా రెండు వారాలపాటు వచ్చినా, దగ్గుతున్నప్పుడు కఫంలో రక్తజీరలు పడినా, ఎడతెరిపి లేకుండా జ్వరం వస్తున్నా, బరువు క్రమేపీ తగ్గుతున్నా క్షయ పరీక్షలు చేయించుకోవాలి. అన్ని చోట్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా క్షయ పరీక్షలు చేస్తున్నారు.

క్షయ రోగులకు ప్రభుత్వం నుంచి సాయమందుతోందా.?

క్షయ రోగులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ప్రతినెలా రూ.500 ఇచ్చేది. వారు కోర్సు వాడిన ఆరు నెలలపాటు రూ.3 వేలు అందించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల వ్యవధిలోనే వారికి అందించే మొత్తాన్ని రూ.వెయ్యికి పెంచింది. ప్రస్తుతం ఆర్నెల్లకు రూ.6వేలు అందుతుంది. ఇది ఈ నెల ఒకటో తేది నుంచి అమల్లోకి వచ్చింది.

ప్రభుత్వాస్పత్రిలో కేన్సర్ సేవలు ఏమైనా అందుబాటులోకి వచ్చాయా.?

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పది రోజుల క్రితమే కేన్సర్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. కేన్సర్ ప్రాథమిక నిర్ధారణ పరీక్షలతో పాటు ప్రాథమిక స్థాయిలో వైద్యం కూడా అందిస్తున్నాం.

గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు
కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నిషేధిత గుట్కా, పాన్, పాన్ మసాలా వంటి వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య వ్యాపారులను హెచ్చరించారు. ఆదివారం నగరంలోని ప్రధాన వీధుల్లోని దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి విక్రయించడం గానీ, వినియోగించడం గాని చేస్తున్నారా? లేదా? అని పరిశీలించారు. కొన్ని టిఫిన్ దుకాణాలలో ఇంకా పాలిథీన్ బ్యాగులు, ముచ్చు కవర్లతో ప్యాకింగ్ చేయడం వంటివి గమనించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. చిరు వ్యాపారులను మందలించారు. మరోసారి ఇటువంటివి పునరావృతమైతే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

కంటోన్మెంట్ తదితర ప్రాంతాలలో ప్రధాన కాలువలో చెత్తాచెదారాలు నిండి, నిరుపయోగంగా ఉండటాన్ని గమనించి సంబంధిత సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే కాలువలో చెత్తను తొలగించాలని ఆయన ఆదేశించారు.

ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహనరావు, ఆయాల యూనియన్ నాయకులు

26న స్కూల్ ఆయాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ఐదు నెలల వేతన బకాయిలు చెల్లించాలని ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహనరావు, ఎపి పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వై.నందిని, ఉపాధ్యక్షులు పార్వతి తెలిపారు. ఆదివారం స్థానిక జొన్నగుడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మరుగుదొడ్లు, తరగతి గదులను శుభ్రం చేయడం, తాగునీరు అందించడం, పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టడం వంటి పనులను ఆయాలతో రోజంతా చేయిస్తున్న ప్రభుత్వమిచ్చే అతి తక్కువ వేతనం రూ.6 వేలు కూడా సకాలంలో ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. 300లోపు పిల్లలకు ఒకే ఆయాను కేటాయించడంతో పని భారం తీవ్రంగా పెరిగిందన్నారు. ప్రతి 50 మందికి ఒక ఆయాను నియమించాలని, సిక్ లీవులు అమలు చేయాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లపై చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్యవతి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు బస్సులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కార్తీక మాసం సందర్భంగా ఎపిఎస్‌ఆర్‌టిసి పంచారామాలకు ఏర్పాటుచేసిన ప్రత్యేక సర్వీసులను ఆదివారం డిపిటిఒ సిహెచ్ అప్పలనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం యాత్రికులతో బయల్దేరే బస్సు ఐదు క్షేత్రాలను సందర్శించాక, మంగళవారం డిపోకు చేరుకు చేరుతుందని తెలిపారు. ప్రత్యేక బస్సుల టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఆరు బస్సులు పంచారామాలకు, ఒక బస్సు శ్రీశైలం వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం ఆర్‌టిసి డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సిఐ బి.ఆదినారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై 21న కలెక్టరేట్ వద్ద ధర్నా

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 21న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. 12వ పిఆర్‌సి కమిటీ వేసి, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఎపిటిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎ.సదాశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వై పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు.

నిరాడంబరంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

తల్లిదండ్రుల ఆశీర్వచనం తీసుకుంటున్న ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు జన్మదిన వేడుకలను స్థానిక అశోక్ బంగ్లాలో ఆదివారం నిరాడంబరంగా నిర్వహించారు. ఎమ్మెల్యే తల్లిదండ్రులు కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, సునీలా గజపతి ఆశీర్వాదం తీసుకున్నారు. మూగ, చెవిటి విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి, వారికి తినిపించారు. అనంతరం టిడిపి నాయకుల సహకారంతో ఆ విద్యార్థులకు రూ.1.52 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, జొన్నవలస, రాకోడు ఎంపిటిసిలు రాజేష్‌బాబు, వేచలపు శ్రీనివాసరావు, టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, మండల కార్యదర్శి గంటా పోలినాయుడు, టిడిపి నగర నాయకులు అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్, సారిక, బియ్యాలపేట సర్పంచులు బొబ్బాది ఈశ్వరరావు, పడగల అబద్ధం, రామకృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గండ్రేటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సుంకర నారాయణరావు, ఎమ్మి శ్రీను, పాశి అప్పలనాయుడు, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, మాజీ కౌన్సిలర్ రొంగల రామారావు, కొసర శివ, తదితరులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపేందుకు టిడిపి శ్రేణులు భారీగా తరలిరావడంతో అశోక్ బంగ్లా కళకళలాడింది.

విజయనగరం టౌన్ : ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యేకు కమిషనర్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

అదానీని అరెస్టు చేయాల్సిందే

ప్రజాశక్తి భోగాపురం

అదానీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి అరెస్టు చేయాలని సిపిఎం నాయకులు బి. సూర్యనారాయణ అన్నారు. భోగాపురంలోని ముక్కాం వెళ్లే కూడలి వద్ద ఆదివారం ప్రకార్డులతో నిరసన చేపట్టారు. మన రాష్ట్రంలోనూ పెద్దలతో ఆయనకున్న సంబంధంపై విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒనం రమణ, బమ్మిడి సంజీబు, మరాడ రవి, నక్క రమేష్, అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తకపఠనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే కథలు పుస్తకాలను గ్రంథాలయాధికారి మహేష్ చదివించారు. ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి కొత్త కొత్త విషయాలను తెలుసుకోవాలన్నారు. మంచి పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానంతో పాటు వినోదాన్ని కూడా పొందవచ్చునన్నారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వెలమ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి- డెంకాడ

విజయనగరం జెఎన్‌టియు కళాశాల వద్ద జరిగిన ఆత్మయ సమ్మేళనంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్‌ను డెంకాడ మాజీ పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం ఆదివారం ఘనంగా సత్కరించారు.

చైర్మన్‌ను సత్కరిస్తున్న కనకసింహాచలం

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

జెసిబి, రెండు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రోత్ సెంటర్ పక్కనున్న సోమివారి చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న జెసిబి, రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నట్లు గున్నతోటవలస గ్రామస్తులు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ ఎం.శ్రీను, ఆర్ఐ కె.రామ్‌కుమార్ పోలీసులు సహకారంతో చెరువు వద్దకు చేరుకుని గ్రావెల్ తవ్వుతున్న జెసిబిను, గ్రావెల్ తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. గ్రావెల్, మట్టి ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీను హెచ్చరించారు. అక్రమ తవ్వకాలు నివారణకు సహకరించాలని ప్రజలను కోరారు.

ఎన్‌సిసితో నాయకత్వ లక్షణాలు

సెంచూరియన్ విసి మహంతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) ముందంజలో ఉందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. ఆదివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో 76వ ఎన్.సి.సి వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను బాధ్యతాయుతమైన నాయకులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సిసి చేసిన సేవలను ఆయన కొనియాడారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, సేవా స్ఫూర్తిని ప్రోత్సహించడంలో ఎన్‌సిసి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యాన్ని నిర్మాణాత్మక పాత్ర పోషిస్తోందని డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ అన్నారు. ఎన్‌సిసి క్యాడెట్‌లు తరచుగా విపత్తు ఉపశమనం, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు, జాతీయ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ దేశానికి సేవ చేయడంలో నిబద్ధతను ప్రదర్శిస్తొన్నారని ఐక్యూఎసి హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు అన్నారు. లెఫ్టినెంట్ డాక్టర్ సతీష్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి దిక్సూచి రాజ్యాంగం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మన ప్రజాస్వామ్యానికి దిక్సూచిగా నిలిచిందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ రైట్స్ ఫోరం ఆధ్వర్యాన ఈ నెల 26 నుంచి డిసెంబర్ ఆరో తేది వరకు చేపట్టే భారత రాజ్యాంగ పరిరక్షణ, చైతన్య యాత్ర కరపత్రాలను జెడ్‌పి చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, విధులు, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తే తరుణంలో హెబిఎస్ కార్పస్ వంటివి పౌరుల హక్కులను కాపాడడంలో కీలక భూమిక వహిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు భానుమూర్తి, పూసర్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 530 మంది

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా 530 మంది నమోదు చేసుకున్నారని ఎన్నికల డిటి గౌరిశంకరరావు తెలిపారు. బొబ్బిలి 403, రామభద్రపురం 46, బాడంగి 38, తెర్లాం 43 మంది ఉపాధ్యాయులు నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు.

పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: పంచారామాల దర్శనానికి ఎస్. కోట డిపో నుంచి ప్రత్యేక బస్సులు పెడుతున్నామని డిపో మేనేజర్ కె. రమేష్ ఆదివారం తెలిపారు. డిపో నుంచి పంచారామాల దర్శనానికి ఆదివారం పంపిన ఆల్ట్రా డీలక్స్ బస్సును డిపో మేనేజర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

శివ్వాంలో నేడు ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వంగర

మండలంలోని శివ్వాంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని ఎఒ తట్టికోట కన్నబాబు తెలిపారు. నిలువ దోపిడీ అనే కథనం ప్రజాశక్తిలో ఈనెల 23న ప్రచురణ కావడంతో జిల్లా అధికారులు వెంటనే స్పందించి దళారులు నిలువ దోపిడికి రైతులు గురు కాకుండా రైతుల సౌలభ్యం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

కొల్లి అప్పలనాయుడుకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

'కొల్లి'కి ఘన స్వాగతం

ప్రజాశక్తి- బాడంగి

రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులై తొలిసారిగా స్వగ్రామం కోడూరుకు వచ్చిన కొల్లి అప్పలనాయుడుకు ఆదివారం మండల టిడిపి నాయకులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామం, మండల అభివృద్ధితో పాటు కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

మోడీ దుర్మార్గమైన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, నవంబర్ 26న బొబ్బిలి ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్ నుంచి నిర్వహించనున్న ప్రదర్శనలో కార్మికులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొవాలని జండా వీధి సెంటర్ నుంచి ఆదివారం ఆటో ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ సర్వసంపదలు సృష్టించేది కార్మిక వర్గం, ప్రజలకు తిండి పెట్టేది రైతాంగం, కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు అనుకూలంగా గత10 ఏళ్లలో కేంద్రంలో బిజెపి రూ.19.28 లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ ప్రోత్సాహాలు పేరుతో ప్రజల ధనాన్ని దోచు పెట్టిందన్నారు. ఎఐటియుసి నాయకులు యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ దుర్మార్గమైన 4లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలన్నారు. రైతు సంక్షేమ సంఘం నాయకులు వేమిరెడ్డి లక్ష్మీనాయుడు మాట్లాడుతూ రైతులు పండించే పంటకి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఐఎన్‌టియుసి నాయకులు ముద్దల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు అదుపు చేయాలని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. గోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పని ఎత్తివేయాలని చూస్తుందన్నారు. కనీస ఇపిఎస్ పెన్షన్ 9000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతు, కార్మిక సంఘాల నాయకుల ఆటో ప్రచారం

బొబ్బిలి: ప్రచారం చేస్తున్న నాయకులు

నెల్లిమర్ల : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని అఖిలపక్షం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక మొయిద జంక్షన్ లో అఖిలపక్ష కార్మిక రైతు సంఘాలు ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, కనకల రాము, ఎఐటియుసి నాయకులు మొయిద పాపారావు, ఐఎఫ్‌టియు నాయకులు కాళ్ళ అప్పలసూరి, ఐఎన్‌టియుసి నాయకులు కనకల పద్మనాభం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీ కరణ నిలుపుదల చేసి, 4లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నెల్లిమర్ల జ్యూట్ మిల్‌తో పాటు సారిపల్లి పారిశ్రామిక వాడలో ఉన్న చిన్నతరహా పరిశ్రమలు సుమారు 31కి పైగా మూతపడ్డాయన్నారు. దీంతో 30వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. తక్షణమే మూతపడిన పరిశ్రమలను తెరిపించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

రామభద్రపురం: ప్రధానిమోడీ దుర్మార్గమైన విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని నవంబర్ 26న బొబ్బిలి ఎన్టీఆర్ బొమ్మ సెంటర్ నుంచి నిర్వహించనున్న ప్రదర్శనలో కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొవాలని ఆటో ప్రచారం చేస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావు తెలిపారు. ఈ మేరకు స్థానిక సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను ఆధ్వర్యంలో మండలం నుంచి పెద్దఎత్తున ఈ ప్రదర్శనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. బలస శ్రీను మాట్లాడుతూ దుర్మార్గమైన 4లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు లక్ష్మునాయుడు, ఐఎన్‌టియుసి నాయకులు ముద్దల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము లేపుతున్న రాజాం రోడ్డు

ప్రజాశక్తి- రాజాం

రాజాం నుంచి పాలకొండకు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అయితే రోడ్డు గుంతలను పూడ్చేందుకు రాయిపిండి వేశారు. ఈ మేరకు రోడ్డుపై వాహనాలు నడుస్తుంటే దుమ్ము రేగి ప్రయాణాలకు ఇబ్బందులు కలిగిస్తోంది. సంతకవిటి, వంగర, రేగిడి ఆమదాలవలస మండలాలకు రాజామే ప్రధాన కేంద్రం. రాజాంలో వివిధ విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రిలు, ప్రముఖ వ్యాపార షాపులు ఉండటంతో నిత్యం వాహనదారులతో రద్దీగా ఉంటుంది. రోడ్డుపై ప్రయాణం చేస్తుంటే దుమ్ము, ధూళితో పొగ మంచులా కనిపిస్తుంది. ఈ రోడ్డుపై ప్రజలు ప్రయాణించాలంటే ఆరోగ్య సమస్యలు, శ్వాస కోస వ్యాధులు వస్తాయెమోనన్న భయంతో రాజాం రావటానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క రహదారి పనులు జరుగుతున్నప్పటికీ మరో పక్క దూలి కారణంగా ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ధూలి వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనులను అధికారులు పర్యవేక్షించకపోవడం వల్ల ఎటువంటి నిబంధనలూ పాటించడం లేదని డోలపేట గ్రామస్తులు వాపోతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి రాజాం పట్టణంలో గల స్కూళ్ళు, కాలేజీ, ఉద్యోగాలకు, మార్కెట్‌కి వచ్చే ప్రజలు తమ ముఖాలను కప్పి ఉంచుకోవలసిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి రాయి పిండి వేసిన తరువాత ఆ రోడ్డుపై కాంట్రాక్టర్ నీటిని చిలకరించాల్సి ఉంది. అలా చేస్తే దూలి పైకి వచ్చే అవకాశం ఉండదు. కానీ అలా చేయలేదు. దీంతో దుమ్ము రేగి పొగ మంచును తలపిస్తుంది. ఈ పొగ, ధూలితో స్థానికంగా నివసిస్తున్న వారు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంతో పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రహదారి పక్కన ఉన్న షాపులోకి క్షణాల్లో దుమ్ము, ధూళి చేరుతుందని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల ఊపిరితిత్తులపై తీవ్రంగా ప్రభావం పడుతుందని వివిధ శ్వాసకోశ వ్యాధులు, అలర్జీ ప్రతి చర్యలకు కారణం అవుతుందని దుకాణాదారులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు, ఎమ్మెల్యే స్పందించి రహదారి పై వాటర్ సర్వీస్ చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు, వ్యాపారులు కోరుతున్నారు.

పొగమంచును తలపిస్తున్న ధూళి

ఎమ్మెల్యేతోనే అభివృద్ధి సాధ్యం

జనసేన నాయకులు దిండి రామారావు

ప్రజాశక్తి- డెంకాడ

ఎమ్మెల్యే లోకం నాగమాధవితోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు దిండి రామారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యేతో కలిసి తాను 2014 నుంచి కృషి చేస్తున్నానన్నారు. కష్టానికి తగ్గట్టుగానే ఆమెను 2024లో ఎమ్మెల్యేగా గెలిపించుకున్నామని ఆమె కూడా నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఎమ్మెల్యే సారధ్యంలో ప్రారంభమయ్యాయన్నారు. ప్రతి మండలంలోనూ సుమారు రూ. 5కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, రహదారులను అభివృద్ధి చేస్తున్నారంటే అది కేవలం ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఘనతేనన్నారు. ఆమె సారధ్యంలో తాను కూడా పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పార్టీ అభివృద్ధికి గతంలో రూ. లక్ష విరాళంగా ఇచ్చానని, ఇప్పటంలో పార్టీ ఆవిర్భావ సభకు ఇక్కడ నుంచి పెద్ద ఎత్తున కార్లు, బస్సుల ద్వారా కార్యకర్తలను తరలించామని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు లోకం నాగమాధవి ఆధ్వర్యంలో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జనంలోకి జనసేన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పార్టీకి సంబంధించిన పెద్దలు జిల్లాకి, నియోజకవర్గానికి వచ్చినపుడు యువతను ఉత్తేజ పరిచేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించామన్నారు. వైసిపి ప్రభుత్వంలో పలుమార్లు అవినీతి అక్రమాలపై మీడియా సమావేశాలు పెట్టి ఎండగట్టామన్నారు. జొన్నాడ పంచాయతీ మన్యాలపేట గ్రామంలో కిడ్నీ సమస్యపై పోరాడి విజయం సాధించామన్నారు. సుమారు రూ. 2లక్షలు తన సొంత ఖర్చుతో చింతలవలస, ఐనాడ రోడ్లను బాగుచేయించామన్నారు. పార్టీ బలోపేతానికి ఇప్పటికే చాలా సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇవన్నీ చూసిన ప్రజలు 2024 ఎన్నికల్లో జనసేన తరుపున పోటీ చేసిన నాగమాధవికి పట్టం కట్టారని దీనిలో తాను భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని చెప్పారు. ఎమ్మెల్యే నాగమాధవి ఆదేశానుసారం నియోజకవర్గం అభివృద్ధితో పాటు పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని దిండి రామారావు తెలిపారు.

మాట్లాడుతున్న రామారావు

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక ప్రభుత్వ పింఛన్‌దార్ల భవనంలో నిర్వహించారు. ముందుగా సమావేశం నిర్వహించి తరువాత ఎన్నిక నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి పొట్నూరు వాసుదేవరావు వ్యవహరించారు. యుటిఎఫ్ నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా మద్దిల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లెంక సన్యాసి నాయుడు, గౌరవాధ్యక్షులుగా గాడు పరమేశ్వర రావు, సహాధ్యక్షులుగా వంగపండు సురేష్ బాబు, కొండల పద్మావతి, కోశాధికారిగా బోని రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సురట రాజేంద్రప్రసాద్, సిపియస్ కన్వీనర్‌గా సుంకర చలపతిరావు, జిల్లా కౌన్సలర్స్‌గా రెడ్డి అసిరినాయుడు, గొర్లె మధు, బి.లక్ష్మణరావు, చందక కృష్ణ, పిపి శ్రీనివాసరావు, కొండపల్లి జయరాం, జి.కుమారస్వామి, రెడ్డిపల్లి చంద్రకళ, మాత కిశోర్ కుమార్, యస్.సప్తగిరి ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్ అభినందించారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు

ఆలయ కమిటీల్లో చోటు కల్పించాలి

విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- డెంకాడ

రాష్ట్రంలోని అన్ని ఆలయాల కమిటీల్లో విశ్వబ్రాహ్మణులకు కూడా చోటు కల్పించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తాలాబత్తుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల కమిటీల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించి విశ్వబ్రాహ్మణులను విస్మరించడం విచారకరమని అన్నారు. మండలంలోని చింతలవలసలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిదిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్ర మంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. సన్యాసిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుగంధం నాగమల్లేశ్వరరావు. విశాఖ జిల్లా అధ్యక్షుడు కోనూరు విజయభాస్కరరావు, జిల్లా నాయకులు ఆవుపాటి నాగభూషణరావు, కోనూరు రాంబాబు, ఉమామహేశ్వరరావు, ఉమాపతి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన అధ్యక్షుడుగా ఉమామహేశ్వరరావు

రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడుగా కాకినాడ ఉమామహేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులుగా అప్పలభక్తుల నరసింహ రాజు, అవుపాటి నాగభూషణం, కన్వీనర్‌గా కోనూరు రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా వెదురుపర్తి సత్య ఉమాపతి, కోశాధికారిగా మంతెన అప్పలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంభాన లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తెల్ల సోమశేఖర్ ఎన్నికయ్యారు.

తహశీల్దార్‌పై ఎంపిటిసి ఫిర్యాదు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ తహశీల్దార్ టి.గోవిందపై చౌడువాడ ఎంపిటిసి పసుపులేటి లలిత కళ, ఆమె భర్త పసుపులేటి గోపి జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. తమ పంచాయతీలో ఆదివారం రెవెన్యూ సదస్సు నిర్వహించి ఎంపిటిసిగా తనకు ఎటువంటి సమాచారమూ ఇవ్వలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. టిడిపి ఎంపిటిసిని కాబట్టే తమకు సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గంలో జనసేన, వైసిపి నాయకులు, కార్యకర్తలకు మాత్రమే అధికారులు సమాచారం ఇస్తున్నారన్నారు. ఈ విషయమై ఇటీవల టిడిపి మండల పార్టీ ఆధ్వర్యంలో గ్రామాల్లో కార్యక్రమాలు జరిగితే తమ నాయకులకు సమాచారం ఇవ్వాలని తహశీల్దార్‌ను కలిసామన్నారు. రెవెన్యూ పరంగా గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా టిడిపి నేతలకు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలకు సమాచారం ఇస్తామని తహశీల్దార్ చెప్పారన్నారు. అయితే ఆదివారం తమ పంచాయతీలో రెవెన్యూ సదస్సు జరిగితే కనీసం తమక సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ఇన్చార్జి మంత్రి అనితకి, జిల్లా మంత్రి శ్రీనివాసరావుకు, కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు విలేకరులకు తెలిపారు. అధికారులు ఏకపక్షంగా ప్రవర్తిస్తున్నారని, అందులో ముఖ్యంగా తహశీల్దార్‌కు చెప్పిన తరువాత కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నెల్లిమర్ల: జాబితాను పరిశీలిస్తున్న తహశీల్దార్, డిటి

ప్రత్యేక ఓటర్ల నమోదును పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రత్యేక ఓటు నమోదును తహశీల్దార్ పి. సుదర్శనరావు ఆదివారం పరిశీలించారు. మండలంలోని కొత్తపేట, రామతీర్థం, సీతారాముని పేట పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటు నమోదును ఆయన డిటితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటి వివిఆర్ జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ అజయ్ రఫీజ్ అన్నారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బైరిపురంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఓటర్ నమోదు కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిటి విజయ్ భాస్కర్, గ్రామ సర్వేయర్ జానకిరామ్, విఆర్ఓ శివప్రసాద్, సచివాలయ సిబ్బంది ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

10 మంది అరెస్టు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సారిపల్లి సమీపంలో పేకాటాడుతున్న పదిమందిని ఆదివారం అరెస్టు చేశామని ఎస్ఐ బి. గణేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 13,150 నగదు స్వాధీనంచ చేసుకున్నామన్నారు. ఎవరైనా జూదం ఆడినట్లయితే చట ప్రకారం చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో జరిగే కోడి పందాలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని 9121109444 సమాచారాన్ని అందించాలని కోరారు.

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

రామభద్రపురం: ఆరికతోట దరి నరసాపురం జంక్షన్ వద్ద ఆదివారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామభద్రపురానికి చెందిన బాదంపూడి విశ్వేశ్వరరావు నరసా పురం శివాలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. అదే పనిమీద వెళుతుండగా జగన్నాథపురం గ్రామానికి చెందిన ఈగల సింహాచలం, గోవర్ధన్‌లు రామభద్రాపురం వెళ్లేందుకు వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పూజారి విశ్వేశ్వరరావుకు కాలు విరిగింది. మిగతా ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షత గాత్రులను ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

'మాలల గర్జన' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వంగర

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రపతి నిలుపుదల చేయాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మజ్జి గణపతి, ఎం.గణపతి రావు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి ఈనెల 29న చలో శ్రీకాకుళం, డిసెంబర్ 8న చలో విశాఖ బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులను విభజించి పాలించే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాలకుల రాజకీయ లబ్ధి కోసం బడుగు బలహీన వర్గాల మధ్య అనైక్యతను ఏర్పరిచారన్నారు. సమస్యలు పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు గంగులు, రాజు సింహాచలం, బుజ్జి, రామారావు, చిన్న సూరమ్మ, కళావతి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ పి.నీలావతి అన్నారు. సంకిలి షుగర్ ఫ్యాక్టరీ కేన్ యాడ్ ఆవరణలో ఆదివారం డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిమితికి మించి చెరుకు లోడులు లారీలకు, ట్రాక్టర్లకు ఎక్కించరాదన్నారు. అలా అధిక లోడుతో వస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రహదారి గుంతల మయం కావడంతో వేగ నియంత్రణ తప్పనిసరి అని అన్నారు. షుగర్స్ ఉపాధ్యక్షులు పట్టాభిరామిరెడ్డి, కెన్ ఎజిఎం రమేష్, కమలా పట్నాయక్ ఉన్నారు

మాట్లాడుతున్న ఎస్ఐ నీలావతి

ఘనంగా ఎన్‌సిసి డే

ప్రజాశక్తి-విజయనగరం

సీతం కళాశాలలో 2ఎ గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో 76వ ఎన్‌సిసి డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతం డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ క్యాడెట్లు ఉన్నత స్థాయికి చేరుకోవటానికి మార్గాలను ఎలా చేరుకోవాలో విపులంగా వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర, రిటైర్డ్ లెఫ్టినెంట్ కమాండర్ పి ఎస్‌వి రవితేజ మాట్లాడారు.

కొనసాగుతున్న ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియ ఆదివారం కొనసాగింది. పలు పోలింగ్ కేంద్రాలను కమిషనర్ నల్లనయ్య పరిశీలించారు. నమోదు ప్రక్రియను పరిశీలించారు. బిఎల్ఒ, సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

VIZIANAGARAM MUNICIPAL CORPORATION

e-Proc. Short NIT No.756/12/E/TO/2024-25 (3rd call), Dt.23-11-2024

Restoration of potholes at various locations., Est.Rs.58.81 Lakhs.

Download start date & time	25-11-2024 from 10.30 A.M.
Download end date & time	28-11-2024 upto 10.30 A.M.
Bid Submission Closing Date & Time	28-11-2024 upto 11.00 A.M.
Bid opening date & time	28-11-2024 after 11.30 A.M.

Contact Nos.9849906481, 9849908296. Further details can be seen at **www.apeprocurement.gov.in.**

COMMISSIONER

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL JUDICIAL MAGISTRATE OF I CLASS CUM ADDITIONAL JUNIOR CIVIL JUDGE, VIZIANAGARAM
E.A. 28/2015 IN E.P. 7/2012 IN O.S. 5/2009

Between:
Giduthuri Krishna ......Dhr
And:
Nakkidapu Simhachalam and others ......Respondents

NOTICE

To:
Nakkidapu Kanaka D/o Late Appayya, aged about 26 years, resident of Siripuram Village, Gantyada Mandal, Vizianagaram District.

Please take notice that the Dhr filed the above execution petition against you and others, and the above matter stands posted to **09.12.2024** for your appearance before the above said Honourable Court. Therefore, you have to appear before the above said court either personally or through an Advocate duly authorized at **10.30 Am., on 09.12.2024** before the above court. Failing which the matter will be decided as per the material available on record.

CH. RAMBABU,
Advocate for DHR
Vizianagaram